కథ

# దసరా .... సరదా ?

- ఎ.ఆర్. స్వామి

**అవి** దసరా పండగ రోజులు. జానకి, పండగ ఇంకా వారం రోజులు ఉందనగా, ఇంటి బూజులు దులపడం, సామాన్లు సర్దడం వగైరా పనులతో పండుగ కార్యక్రమం మొదలుపెట్టింది. 'ఆదిలోనే హంసపాదు' అన్నట్లు జానకి బూజు కర్రపట్టుకుని బూజు దులుపుతుండగా అటకమీద ఉన్న కిరసనాయిలు డబ్బాకి ఆ కర్ర తగిలి కిరసనాయిలు కాస్తా ఒలికి పెరుగు గిన్నెలో పడింది. 'రొట్టెవిరిగి నేతిలో పడాలి' గాని అయ్యో! కిరసనాయిలు ఒలికి పెరుగులో పడింది ఇది శుభసూచకమా? అశుభ సూచకమా? పండుగరోజుల్లో ఏమి అనర్థం రానున్నదో ఏమో? నాకు మా ఆయన కొత్త చీర కొంటారో లేదో' అని పరిపరి విధాల జానకి ఆలోచనలు సాగాయి.

ఇంతలో పనిమనిషి పైడమ్మ సీనులోకి ఎంటర్ అయ్యింది. 'పైడమ్మా! ఈ ఇంటి చాకిరీతో పిల్లలతో వేగలేక ఛస్తున్నాను. కొంచెం ఇల్లు కడగటం, బూజులు దులపడం వగైరా పనుల్లో (ఈ పనులు పైడమ్మ రెగ్యులర్ పనుల లిస్టులో లేవు గనుక) కొంచెం సాయంచేయి. ఎంతో కొంత ముట్ట చెబుతాలే' అని కొంత పని పైడమ్మకి పురమాయించింది జానకి. ఇదే సరైన అవకాశం. ఆలసించిన ఆశాభంగం. అని తలచి పైడమ్మ తన గోడు మొదలుపెట్టింది.

'అమ్మగోరూ! ఈ దసరాకి నాకు ఏమివ్వాలనుకుంటున్నారు?'

'ఏమివ్వాలనుకోవడం ఏమిటే ?'

సరిపోయింది ఇక పనిమనిషి కోరికలు తీర్చడానికి దాన్ని కూడా 'ఫేమిలీ - డెఫినిషన్'లోకి చేర్చాలా ఏమిటి అని ఆలోచనలోపడింది జానకి.

"అవునమ్మగోరూ! కిందటిసారి దసరా పండక్కి చీరకొనమనడిగితే ఏదో ఒక పాతిక రూపాయలు నా మొహాన్న పారేసి జాకెట్టు గుడ్డ కొనుక్కోమన్నారు. ఈసారి అలా చేస్తే నేనూరుకొనేది లేదు. ఈసారి నాకు పండక్కి ఒక చీర తప్పనిసరిగా కొనివ్వాలమ్మగోరూ! అయ్యనడిగి ఎలాగైనా నాకు కొత్తచీర ఏర్పాటు చెయ్యండి" అని తన మనసులోని కోరికను వెలిబుచ్చింది పనిమనిషి పైడమ్మ.

'అయ్యా పండగ చీర యింకా నాకు కొనే సంగతే తేల్చలేదు. ఇక నీక్కూడా చీర అంటే నన్ను తిట్టిపోస్తారే! మొన్నీమధ్య తీసిన లోను కారణంగా ఈ నెల జీతం కూడా తక్కువగా వస్తుందన్నారు' అని జవాబు చెప్పి తప్పించుకోబోయింది జానకి.

'అదేంటమ్మగోరూ! అయ్యకి బోనస్, డి.ఎ. ఏరియర్స్, జీతం అన్నీ పండగ సందర్భంగా ఒకేసారి రేపు 26వ తారీఖున ఇస్తున్నారటగా. (ఫైనాన్స్ మినిస్టర్ తరువాత వార్తాపత్రికల వారికంటె ముందుగా ఈ పనిమనుషులకే ఇటువంటి విషయాలు తెలుస్తాయి కాబోలు.) 29వ తారీఖున దసరా కదమ్మా అందుచేత ఇయ్యాలే అయ్యతో మాట్లాడి ఎలాగైనా నాకు ఒక మంచి చీర కొనివ్వాలమ్మా' అని తన మనసులో ఉద్దేశ్యాన్ని ఖచ్చితంగా వెలిబుచ్చింది పనిమనిషి పైడమ్మ.

ఈ పనిమనుషులందరూ రెండు రోజుల నుండి మధ్యాహ్నం వీధుల్లో మీటింగు నిర్వహిస్తున్నది, హడావుడిగా తిరుగుతున్నది ఈ దసరా డిమాండుల 'ఫైనలైజేషన్' కోసమేనేమో అన్న సందేహం కలిగింది జానక్కి.

సాయంత్రం ఆరుగంటలు కావస్తున్నది. రావు ఆఫీసు నుండి వచ్చే వేళయ్యింది. ఇల్లు దులపడం, కడగటం పనులన్నీ ముగించుకుని ముస్తాబై చిన్న పిల్లకి పాలు పట్టి ఉయ్యాల్లో పడుకోబెట్టింది జానకి. పెద్ద పిల్ల రాజీ ఏడు సంవత్సరాల వయసుది. అంతవరకూ వీధిలో ఆడుకుని నాన్నగారు ఇంటికి వచ్చే వేళయ్యింది కదా అని వాడిన ముఖంతో ఇల్లు చేరింది.

'ఒసేవ్! రాజీ! నాన్నగారు వచ్చేవేళయ్యింది. ముఖం, కాళ్ళు చేతులు కడుక్కుని ఆ పుస్తకాలు కొంచెం తెరచి హోంవర్కులు చెయ్యి' అని కూతుర్ని ఆజ్ఞాపించింది జానకి.

'సరేనమ్మా!' అని అమ్మ చెప్పినట్లే కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కుని పుస్తకాల సంచీ తన ముందు వేసుకుని కూర్చుంది రాజీ. ఇంతలో రావు పగలంతా ఆఫీసుపనిలో మునిగి బస్సుల రద్దీలో అలసి, సొలసి, నీరసంగా ఇల్లు చేరాడు. అతని ముఖంలో అలసట గమనించి పెద్ద

కూతురు రాజీ తండ్రికి నీళ్ళగ్లాసు అందించింది. నీళ్ళు తాగిన తరువాత కొంచెం ఫ్రెష్ అయి మధ్య గదిలోకి వచ్చి మంచంమీద వాలాడు రావు. ముందుగా చిన్న కూతురు బుజ్జి గురించి అడిగాడు.

'చిన్నది పడుకుందా? ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది'

'ఆ! జబ్బలు పడిపోయేటట్లు రెండు గంటలు ఉయ్యాల ఊపాక అతికష్టంమీద ఇప్పుడే పడుకుంది'

రావు మంచం మీద కొంచెం సేపు రిలాక్స్ అయ్యాక ప్రారంభించింది జానకి.

'ఏమండీ! మీకు దసరాకి బోనస్, డి.ఏ. ఎరియర్స్, జీతం అన్నీ ఒకేరోజున ఇస్తున్నారటగా?'

'ఎవరు చెప్పారు?'

'పనిమనిషి చెప్పింది. దానికి ఈసారి పండగకి ఎలాగైనా మంచి చీర కొని ఇవ్వమని సతాయిస్తోంది. మీరేమంటారు?'

'దానితో నువ్వేమన్నావు?'

'బాబుగారు ఇంకా నా పండగ చీర గురించే తేల్చలేదు. నీ చీర గురించి నేనెలా చెప్పగలను అన్నాను'

'అప్పుడేమంది?'

'అయ్యకు దసరాకి బోనస్ ఇస్తున్నారటగా! మేము సంవత్సరానికి ఒకసారే గదమ్మా అడిగేది అంది. మీ ఉద్దేశ్యం ఏమిటి? మీరు ఏం చేద్దాం అనుకుంటున్నారు? పండగ దగ్గరకి వచ్చేసింది కదా! నా చీర, పిల్లల బట్టలు ఎప్పుడు కొంటారు?' అని తన లిస్టు ఏకరువు పెట్టింది జానకి.

'రేపు ఆలోచించి చెబుతాలే!' అని అప్పటికి ఆ విషయాన్ని వాయిదావేశాడు రావు.

ఇంతలో పెద్దపాప రాజీ తల్లిదండ్రుల సంభాషణ అప్పటివరకు విని తండ్రి దగ్గరకు ముద్దుగా చేరి,

'నాన్నగారూ! మొన్న వరలక్ష్మీ వ్రతానికి అమ్మకి చీర కొన్నారు. నాకు గౌను కొనలేదు. ఇప్పుడు అమ్మకి చీర కొంటే నాకు మొత్తంగా రెండు గౌనులు కొనవలసిందే' అని తన డిమాండు తండ్రి ముందుంచింది.

ఇంతలో ఉయ్యాలలో ఉన్న చిన్నపాప బుజ్జి కెవ్వుమంటూ లేచింది. అది చిన్నది, మాటలు రావు కనుక ఏడుపుతో వదిలేసింది. దాని మనసులో ఏమి కోరికలున్నాయెూ ఏవో? కోరికలకు నరివడ వనరులుండొద్దూ?

0-0-0

మర్నాడు మధ్యాహ్నం రావు యధావిధిగా ఆఫీసుకి బయలుదేరాడు. ఆఫీసు చేరేసరికి టేబిల్ మీద ఉత్తరం కనిపించింది అది రావు తల్లి దగ్గర నుండి వచ్చింది. దాని సారాంశం ఇది.

'ఒరేయ్ అబ్బాయ్! క్రిందటిసారి సంక్రాంతికి మీ ఊరు వచ్చినప్పుడు ఏవో సాకులు చెప్పి, నాకు చీర కొనకుండా తప్పించుకున్నావు. ఈసారి దసరాకి నాకు ఒక 'విమల్' చీర కొనుక్కోవడానికి డబ్బులు తప్పకుండా పంపాలి సుమా! నీవు డబ్బులు తప్పకుండా పంపిస్తావని ఆశిస్తున్నాను. అన్నట్లు మొన్న పేపరులో చదివాను. మీకు ఈనెల బోనస్, డి.ఏ. జీతం అన్నీ ఒకేసారి ఇస్తున్నారటగా?'

0-0-0

ఒక వారం రోజుల తరువాత....

పనిమనిషి పండక్కి చీర కొనలేదన్న కోపంతో పని మానేసింది. జానకి వంట మెనూలో మార్పు. పప్పు, కూరా, పచ్చడి, పెరుగు స్థానంలో చారునీళ్ళు, నీళ్ళ మజ్జిగ చోటుచేసుకున్నాయి. ఈ ఆకస్మిక మార్పులకి కారణం...? రావు దసరా పండక్కి పనిమనిషితో సహా ఇంటిలో వారెవ్వరికీ కొత్తబట్టలు కొనుక్కోవడానికి డబ్బులు ఇవ్వక పోవడమే! అయితే రావు ఆ బోనస్, డి.ఏ. ఏరియర్స్ ద్వారా అందిన సొమ్మును ఏమి చేసినట్లు? ఆ సొమ్ము స్థానంలో రావు జేబులో ఎలక్ట్రిసిటీ బిల్లు తాలూకు రసీదు, ఆస్తిపన్ను రశీదు కనిపించాయి జానక్కి.

బోనస్, డి.ఎ. ఏరియర్స్ మీద రావు కుటుంబ మంతా పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. ప్రభుత్వం, ఇచ్చే సొమ్ముల గురించి పెద్ద ఆర్భాటం చేసి, మీడియా ద్వారా ప్రచారం చేస్తుంది కాని వసూలు చేసుకునే సొమ్ముల గురించి ప్రచారముండదు. చివరికి మధ్యతరగతి కుటుంబీకుడి జేబులో మిగిలేవి కరెంటుబిల్లు, ఆస్తిపన్ను రశీదు వగైరాలే. అతని పండగ సరదా తీరెదెప్పుడు?! ఇదీ సగటు మనిషి దసరా సరదా.

***